క్లుప్తంగా

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


ఉండి జెడ్పీ హైస్కూల్ మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉండి: ఉండి జెడ్పీ హైస్కూల్లో చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు 1992–93 పదవ తరగతి విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.30 వేల విలువైన నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్లను అందజేశారు. పూర్వవిద్యార్థులు కాగిత శ్రీను, వేణుగోపాల్, సత్యనారాయణ, ఇదా విజయ ప్రసాద్, ఇల్లాపు అప్పాజీ, ఉండ్రు ఇస్సాకు తదితరులు పాఠశాలపై తమకు ఉన్న ప్రేమతో ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

కుసుమ హరనాథ వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం


ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ప్రారంభమైన కుటుంబ హరనాథ వార్షికోత్సవం

ఆకివీడు: కుసుమ హరనాథ 83వ వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నగర సంకీర్తన నిర్వహించారు.అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో కుసుమ హరనాథ భక్తులు కీర్తనలు ఆలపించారు. ఆదివారం కుసుమ హరనాథ లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి చెన్నై, తిరుపతి, హైదరాబాద్, వైజాగ్, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కాకర్ల హరిదాసు ఆధ్వర్యంలో వార్షిక మహోత్సవాలు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొంట్ల సుబ్బారావు, కారుమూరి హరి, కే నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం వేములదీవిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు స్వామివార్ని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక కేతకీ పుర సామ్రాజ్య భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు ఐడి కార్డులు అందజేస్తున్న ఎంఈఓ శర్మ, దాత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాత శిడగం సురేంద్ర ఏర్పాటు చేసిన ఐడి కార్డులు, పెన్నులు, పెన్సిల్స్, పుస్తకాలను ఎంఈఓ–2 శర్మ శనివారం అందజేశారు. కార్యక్రమంలో విన్నకోట కృష్ణబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ కరణం పాపారావు, సంగినీడి హరీష్, యర్రా శేఖర్, బొలిరెడ్డి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడికి తీవ్ర గాయాలు


కాజ బైపాస్ రోడ్డులో లారీలోనికి దూసుకెళ్లిన బైక్

యలమంచిలి: కాజ బైపాస్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాల ధరించిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అంబేడ్కర్ కొనసీమ జిల్లా మలికిపురం పట్టణానికి చెందిన మురళీకృష్ణ తన బైక్ మీద దిగమర్రు వైపు నుంచి మలికిపురం వెళ్తుండగా కాజ వంతెన సమీపంలో ఇటుక బట్టీల వద్ద వెనుకగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో మురళీకృష్ణ బైక్ అదుపుతప్పి పక్కగా ఆగి ఉన్న లారీలోకి దూసుకెళ్లింది. మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని స్థానికులు 108 వాహనంపై పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కందిపప్పు.. కొందరికేనా?

- 30 నుంచి 40 శాతం మంది రేషన్ కార్డుదారులకే సరఫరా
- కంది పప్పు ఆలస్యంగా రావడంతో చేతివాటం చూపిస్తున్న డీలర్లు
- టీడీపీ ప్రభుత్వతీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పేదలు



ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సరఫరా చేసిన కందిపప్పు

పాలకోడేరు: ఆకుల్లో కొందరికి అన్నం.. మరి కొందరికి సున్నం.. ఇదీ మా ప్రభుత్వ విధానమంటున్నారు కూటమి నాయకులు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా రేషన్ కందిపప్పు, వంట నూనె కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. దసరా పండుగకు కందిపప్పు ఇస్తున్నామంటూ హడావుడి చేసి, చివరకు 30–40 శాతం కార్డుదారులకే పంపిణీ చేశారు. దీంతో మిగిలిన కార్డుదారులు ఇదేం న్యాయం అంటూ గగ్గోలు పెడుతున్నారు. జనాన్ని మభ్యపెట్టడం, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించడం టీడీపీ అధినేత చంద్రబాబుకు కొత్తేమీ కాదంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికీ ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదని పలువురు అంటున్నారు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.170 పలుకుతున్న వేళ కార్డు దారులకు రాయితీపై 67 రూపాయలకే కిలో కందిపప్పు ఇస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించింది. కేవలం 30 శాతం రేషన్ కార్డుదారుకే సరఫరా చేసి చేతులెత్తేశారు. నాలుగు నెలలుగా బియ్యం, చక్కెర తప్ప ఇతర సరుకులు ఇవ్వడం లేదని రేషన్ కార్డుదారులు అంటున్నారు.

ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాలు ఉన్నాయి. మొత్తం 87,679 రేషన్ కార్డులు ఉండగా 30 నుంచి 40 శాతం కార్డుదారులకు మాత్రమే ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేసింది. ఇలా అరకొర సరఫరా చేయడంలో కూటమి సర్కారు ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాలకు వారం రోజులు ఆలస్యంగా కందిపప్పును సరఫరా చేసింది. కార్డుదారులకు సమాచారం లేక పోవడంతో ఇదే అదునుగా డీలర్లు చేతివాటం చూపిస్తూ కందిపప్పును తమకు నచ్చిన వారికి ఇస్తూ మరికొంత మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

తలలు పట్టుకుంటున్న అధికారులు, డీలర్లు

ప్రభుత్వం 30 నుంచి 40 శాతం కార్డుదారులకు మాత్రమే రాయితీపై కందిపప్పు సరఫరా చేయడంతో అధికారులతో పాటు కొందరు డీలర్లు తలలు పట్టుకున్నారు. ఎవరికి ఇవ్వాలో తెలియక అయోమయానికి గురయ్యారు. రేషన్ పంపిణీ వాహనం వద్ద కందిపప్పు కోసం కార్డుదారులు క్యూ కడుతున్నారు. అరకొర పంపిణీ అనంతరం స్టాక్ అయిపోయిందంటూ డీలర్లు చేతులెత్తేశారు. కొందరు డీలర్లు అసలు పంపిణీ చేయలేదనే ఆరోపణలున్నాయి. దీంతో టీడీపీ ప్రభుత్వం తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ డీలర్లతో వాగ్వాదానికి దిగిన సంఘటనలు ఉన్నాయి. జగనన్న పాలనలో ప్రతి ఒక్క కార్డుదారుడికీ బియ్యం, చక్కెర, గోధుమపిండి, జొన్నలు, రాగులు పంపిణీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

కందిపప్పు ఇవ్వలేదు



రేషన్ దుకాణంలో బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చారు. కందిపప్పు ఇవ్వలేదు. కంది పప్పుపై ప్రశ్నిస్తే స్టాక్ ఇంకా రాలేదని డీలర్ చెప్పారు. అయితే రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్తే అందరికీ రాలేదని చెప్పారు. ప్రభుత్వం కార్డుదారులందరికీ కందిపప్పు ఇవ్వాలని అనుకుందా, లేదా అనే అనుమానం వస్తోంది.

– నల్లి లీలాప్రియా, కుముదవల్లి

అందరికీ పంపిణీ చేయాలి



మాకు కేవలం బియ్యం, చక్కర మాత్రమే ఇచ్చారు. కందిపప్పు అడిగితే లేదన్నారు. కొన్ని ఊర్లలో కందిపప్పు కార్డుదారులకు ఇస్తున్నారు. ఇదేం విధానమో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కార్డుదారులందరికీ రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలి, లేకపోతే మానేయాలి. కందిపప్పును కొందరికే ఇవ్వడంలోని ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు.

– కె.అరవింద్

విద్యతోనే దేశ ప్రగతి వేగవంతం

పాలకోడేరు: విద్యతోనే దేశ ప్రగతి వేగవంతమవుతుందని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం వేంద్ర భూపతిరాజు సుబ్బ తాతరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్, మనబడి– మన భవిష్యత్తు పథకానికి సంబంధించిన నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మరొక ముఖ్యఅతిథి భీమవరం ఆర్డీవో ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, మాజీ ఎంపీపీ పాలా వెంకట చలపతి, పాఠశాలల రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి, జుత్తుగ శ్రీనివాస్, హెచ్ఎం జీవీవీ శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

23న పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఆకివీడు: దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 23న పలు కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుజాత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ వివరాల్ని తెలియజేస్తూ, ఏటీఎం, ముత్తూట్ ఫైనాన్స్, స్టాఫింగ్ టిటాన్స్, ఎల్అండ్‌టీ ఫైనాన్స్, డీ మార్ట్, జెప్టో తదితర కంపెనీల్లో ఫీల్డ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ట్రెయినీ, ప్రొహిబిషనరీ ఎగ్జిక్యూటివ్స్, వివిధ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎస్ఎస్‌సీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావచ్చునన్నారు. ఇంటర్వ్యూ సమయానికి రెజ్యూమ్, ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సుజాత తెలిపారు.

22 నుంచి ఆధార్ మొబైల్ శిబిరాలు

ఉండి: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ మొబైల్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ రవీంద్ర తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 22 నుంచి 25వ తేదీ వరకు ఉండి–2, ఉండి–4, వాండ్రం, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను ప్రజలు,విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ప్రజలంతా ఆధార్ సమస్యలు లేకుండా పరిష్కరించుకునేందుకు ఈ మొబైల్ ఆధార్ సెంటర్లు ఎంతగానో ఉపకరిస్తాయని ఎంపీడీవో తెలిపారు.

దిరుసుమర్రులో పల్లె పండుగ

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో రూ.20 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని దుంపగడప, సిద్ధాపురం, కాళింగగూడెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆయన భూమి పూజ చేశారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మోటుపల్లి ప్రసాద్, పిన్నమరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్‌లు ముద్దే విశ్వేశ్వరరావు, సీహెచ్. చిట్టిబాబు, గురువెల్లి అన్నపూర్ణ పాల్గొన్నారు.

భీమవరంలో భారీ వర్షం


భీమవరం: పట్టణంలో గునుపూడి ప్రాంతంలో జలమయమైన రోడ్లు


భీమవరం అర్బన్: కొత్తపూసలమర్రులో భారీ వర్షంతో జలమయమైన రోడ్డు

భీమవరం/భీమవరం అర్బన్: పట్టణంలో శనివారం భారీ వర్షం కురవడంతో రోడ్లు, పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీనితో గునుపూడి, మెంటేవారి తోట, హౌసింగ్‌బోర్డుకాలనీ, బ్యాంక్‌కాలనీ, ఏఎస్ఆర్ నగర్, సుంకరపెద్దయ్యవీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే మోకాలులోతు నీరు నిలిచిపోవడంతో ప్రయాణీకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతోపాటు పెద్ద పెద్ద పిడుగులు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భారీ వర్షకారణంగా తోపుడుబండ్ల వ్యాపారులు జీవనోపాధి కోల్పోయారు. వర్షాలు కారణంగా భీమవరం పట్టణంలోని ప్రధానరహదారిపై పోలీసు బొమ్మ సెంటర్, విస్సాకోడేరు వంతెన వద్దగల పెట్రోల్‌బంకు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వాహనదారులు పడకుండా స్థానికులు కర్రలకు సంచులు కట్టి హెచ్చరికలు ఏర్పాటు చేశారు.

హైస్కూల్ సమీపంలో మద్యం షాపు వద్దు

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో మద్యం షాపు పెట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హై స్కూల్ సమీపంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారని ఆ పక్కనే చికెన్ పకోడి దుకాణాలు వెలవడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందని ఆ ప్రదేశంలో మద్యం దుకాణం పెట్టవద్దని చెబుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద అధికారులకు సమస్యలను వివరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భీమవరం: మునిసిపాల్టీల్లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్స్ న్యాయమైన డిమాండ్లను పాలకులు తక్షణం పట్టించుకోకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయుసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు హెచ్చరించారు. అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గత 11 రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత మూడు నెలలుగా క్లాప్ డ్రైవర్లకు జీతాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లను కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి శివ, ఆర్‌రమణ, దైవరాజు, బి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలి


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న రంగరాజు

భీమవరం: క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చినప్పుడే మంచి క్రీడా ఫలితాలు అందుకోగలరని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ సాగి విఠల్‌రంగరాజు అన్నారు. కళాశాలలో శనివారం జేఎన్టీయూకే అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ × మెన్ అండ్ ఉమెన్ ×సెంట్రల్ జోన్ టోర్నమెంట్స్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు మాట్లాడుతూ పురుషుల విభాగం నుంచి 28 టీములు, మహిళల విభాగం నుంచి 15 టీములు పాల్గొంటున్నాయని పోటీలు సందర్భంగా సౌత్ జోన్ క్రీడాకారుల ఎంపిక కూడా ఉంటుందన్నారు.

బాధ్యత గల ఉద్యోగుల చేతుల్లోనే గ్రామాల అభివృద్ధి


మహదేవపట్నంలో కార్యదర్శి పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

ఉండి: బాధ్యత ఉద్యోగుల చేతుల్లోనే గ్రామాల అభివృద్ధి ఆధారపడి ఉందని మహదేవపట్నం సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీశ్రీనివాస్, ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు అన్నారు. శనివారం రాత్రి మహదేవపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు బదిలీపై వెళ్లిన కార్యదర్శి కాశీపట్నం పవన్‌కుమార్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సచివాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పవన్‌కుమార్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఘనంగా వీడ్కోలు పలికిన వారందరికీ పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనిమా శ్రీనివాస్, వీఆర్వో ఎస్ చిన్నారావు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో పర్యావరణ దుష్ప్రభావాలు లేకుండా చూడాలి


విష్ణు కళాశాలలో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎస్ఆర్‌కేఆర్ కళాశాల విద్యార్థులు

భీమవరం: నిర్మాణ రంగంలో పర్యావరణ దుష్ప్రభావాలు లేకుండా ముందుకు సాగడం ఎంతో అవసరమని, విద్యార్థులు ఆవిష్కరించే సాంకేతిక పరిజ్ఞానం పర్యావరణాన్ని కాపాడుతూ సుస్థిర అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని భీమవరం ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ శ్రీనివాస్ అన్నారు. విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ లెవెల్ కాంక్రీట్ క్యూబ్ టెస్ట్ కాంపిటీషన్ కాంక్రీటో–2క 24 ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ మంగంవేణు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం కాంక్రీట్ క్యూబ్ టెస్ట్ పోటీ మాత్రమే గాకుండా ఆధునికత, అభివృద్ధి, పర్యావరణ సుస్థిరతలపై కూడా దృష్టి పెట్టిందన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె విజయ్ మాట్లాడుతూ పోటీల్లో దేశంలోని 20 కళాశాలల నుంచి 55 టీములు పాల్గొన్నాయని వాటిలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ, కోయంబత్తూరు కేపీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ద్వితీయ, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల తృతీయస్థానంలో విజేతలుగా నిలిచారు. అనంతరం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి రామరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీ లక్ష్మి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కె విజయ్, బిడీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ పాలకలవర్గ అసిస్టెంట్ సెక్రటరీ శివరామరాజు మృతి


కొత్తపల్లి శివరామ రాజు(ఫైల్)

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల అసోసియేషన్ పాలక వర్గ అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు(59) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివరామరాజు 2013లో కళాశాల అసోసియేషన్ పాలకవర్గ సభ్యునిగా పనిచేసి 2023 నుంచి అసిస్టెంట్ సెక్రటరీగా సేవలందిస్తున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సంతాపసభలో పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) శివరామరాజు చేసిన సేవలను కొనియాడారు. సంతాప సభలో పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సంయుక్త కార్యదర్శి కె రామకృష్ణంరాజు, పిరామకృష్ణంరాజు, ఎ సురేంద్ర తదితరులు ఉన్నారు.

కాలువలను తలపించేలా రహదారులు


కాళ్లలో శివాలయం వద్ద కాలువను తలపిస్తున్న రాష్ట్రీయ రహదారి


కాళ్ల జగనన్న కాలనీలో వర్షపు నీరు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలవలను తలపిస్తున్నాయి. భారీ వర్షానికి రహదారులపై మోకాళ్ల లోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్, శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారిపై కాలువను తలపించేలా వర్షపు నీరు చేరింది. సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న జగనన్న కాలనీల్లో రాకపోకలు స్తంభించేలా వర్షపు నీరు నలిచింది. అసలే అధ్వానంగా ఉన్న కోలనపల్లి – ఆకివీడు రహదారి వర్షంతో అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లో రోడ్లపై, వీధుల్లోని వర్షపు నీరు కిందికి ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సభలు

భీమవరం అర్బన్: గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాంబాబు తెలిపారు. మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో, కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కనక దుర్గమ్మ ఊరేగింపు


స్థానిక గాంధీనగర్‌లో సంప్రదాయ వేషధారణతో నృత్యాలు


అమ్మవారి ఊరేగింపును ప్రారంభిస్తున్న మహిళలు

ఆకివీడు: స్థానిక గాంధీనగర్‌లో వేంచేసియున్న దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఊరేగింపు కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి 15వ వార్షికోత్సవాన్ని శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపు సంబరాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ మాట్లాడుతూ యువత ఉత్సాహంగా అమ్మవారి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఊరేగింపు సందర్భంగా అమ్మవారికి సుమారు రూ.1.20 లక్షలతో తయారుచేసిన గరుత్మతుడు, వామనావతారంలోని విష్ణుమూర్తి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మహాఆదిశక్తి అవతారంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్ని యూత్ ప్రతినిధులు మోటుపల్లి రామాంజనేయులు, కోడేటి శ్రీనివాస్, మణికంఠ, గణేష్, మనోజ్, చిన్నబ్బాయి,వాసు తదితరులు పర్యవేక్షించారు.